క్లుప్తంగా

అల్వాల్ బాలాజీ ఆలయం హుండీ లెక్కింపు



అల్వాల్: బాలాజీ ఆలయంలో హుండీ లెక్కింపు సోమవారం జరిగింది. రెండు నెలలకు రూ.7, 87, 250 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సైంచార్, ఈవో నరేందర్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు తెలిపారు. శివరామకృష్ణ, వెంకటారామిరెడ్డి, సురేందర్‌రెడ్డి, రాము తదితరులున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఉప్పల్: ఉప్పల్ స్వరూప్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. ఆదివారం రాత్రి స్వామి వారిని ఊరేగించారు. స్వామివారి ఆలయం నుంచి ఉప్పల్ కమాన్ వరకు సాగిన రథోత్సవంలో భాగంగా స్థానికుల నృత్యాలు, కోలాట తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సోమవారంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయని ఆలయ ధర్మకర్త కందాడి శ్రీనివాసాచార్యులు తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మల్లాపూర్: జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మంత్రి మల్లారెడ్డికి బీఆర్ఎస్‌కేవీ కాప్రా సర్కిల్ కార్మిక విభాగం అధ్యక్షుడు జి.కుర్మన్న వినతి పత్రం అందజేశారు.

పల్లవి మోడల్ స్కూల్ వార్షికోత్సవం



బోడుప్పల్: విద్యార్థులు ఆరోగ్యకరమైన వ్యక్తిత్వం కోసం కృషి చేయాలని పల్లవి మోడల్ స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ మల్కా కొమరయ్య అన్నారు. బోడుప్పల్‌లోని పల్లవి మోడల్ స్కూల్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ సుధ, డైరెక్టర్లు ఉమా నేహ, సుశీల్‌కుమార్, ప్రిన్సిపాల్ తనూజ, వైస్ ప్రిన్సిపాల్ తనూప్రీత్‌కౌర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గొల్ల కురుమల సంక్షేమానికి పెద్దపీట

కుషాయిగూడ: సీఎం కేసీఆర్ గొల్ల కురుమల సంక్షేమానికి పెద్దపీట వేశారని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఎన్‌టీఆర్‌నగర్‌లో ఆదివారం రాత్రి జరిగిన కురుమ మహిళా సాధికారిక సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని కురుమ కులానికి చెందిన మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. కురుమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామా మల్లేశం, కార్పొరేటర్లు ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, బొంతు శ్రీదేవి, పుష్ప నగేష్, ఉప్పల్ జోన్ ప్రధాన కార్యదర్శి పర్వతాలు, వినోద్‌కుమార్, సంపత్, లత, గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

పాలిటిక్స్.. పీక్స్

పీర్జాదిగూడలో వేడెక్కిన రాజకీయం



ఉప్పల్/మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది. స్వపక్ష నేతలే మేయర్‌పై తీవ్ర విమర్శలు చేస్తూ పత్రికలకు ఎక్కుతున్నారు. ఈ విషయాన్ని అధికార పార్టీ అధిష్టానం గమనిస్తోందన్న విషయాన్ని కూడా గమనించకుండా వర్గపోరు తారస్థాయికి చేరుతోంది. స్థానికంగా నడుస్తున్న పాలిటికల్ డ్రామాపై ఇంటెలిజెన్స్ విభాగం ఎప్పటికప్పుడు పూర్తి సమాచారాన్ని అధిష్టానానికి చేరవేస్తూనే ఉంది. ఇదిలా ఉండగా కొంత కాలంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేటర్లు, మేయర్ మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. విపక్షాలకు చెందిన కార్పొరేటర్లే కాకుండా స్వపక్షం కార్పొరేటర్ల నుంచి కూడా మేయర్ తీవ్ర విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇందుకు కారణం మేయర్ ఒంటెద్దు పోకడలే అని స్వపక్ష నేతలే బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఇందులో భాగంగానే వారం క్రితం ఇద్దరు కార్పొరేటర్లు మేయర్ తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ వార్తల్లోకి ఎక్కారు.

ప్రజాప్రతినిధులపై స్థానికుల ఆగ్రహం

పేకాటరాయుళ్లను ఎలా కాపాడాలనే విషయంలోనే మునిగి అత్యుత్సాహం ప్రదర్శించినట్లు స్థానికులు, మీడియా ప్రతినిధులు ఆరోపించారు. తాను ఎంతో విశ్వాసంతో ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు ఈ విధంగా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడటం, అదికూడా అధికార పార్టీ నేతలు కావడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇటీవలి కాలంలో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్లు వార్తలు గుప్పుమన్నాయి. ఈ క్రమంలోనే పేకాట ఆడుతున్న వీరిని ఉద్దేశపూర్వకంగానే ఇరికించారని ఆరోపణల సైతం వినిపిస్తున్నాయి.

సమాచారం ఇచ్చింది.. అధికార పార్టీ నేతలే..

ముచ్చటగా మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న కార్పొరేషన్ విజయోత్సవాల సంబురాలు మరువక ముందే తాజాగా అధికార పార్టీ కార్పొరేటర్లు కొంత మంది మేయర్‌పై ఘాటైన విమర్శలు చేయడంతో పార్టీలో గందర గోళం ఏర్పడింది. మరో అడుగు ముందుకేసి మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టనున్నట్లు కొంత మంది కార్పొరేటర్లు ప్రకటించారనే వార్త కూడా హల్‌చల్ చేసింది. ఇదే తరుణంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అసమ్మతి నేతలంతా కో ఆప్షన్ సభ్యుడి కార్యాలయంలో కార్పొరేటర్ల భర్తలు, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్, కొంతమంది టీఆర్ఎస్ నేతలు సమావేశమైనట్లు సమాచారం. ఇదే అదనుగా భావించిన కొందరు అధికార పార్టీ నేతలే ఎస్‌వోటీ పోలీసులకు సమాచారం అందించారని, పెద్ద ఎత్తున పేకాట నడుస్తోందని, భారీ ఎత్తున నగదుతో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందించారని, దీంతో మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు స్థావరంపై దాడి చేశారని, అందులో పెద్ద తలకాయలు పట్టుబడటంతో వారు ఖంగు తిన్నట్లు సమాచారం.

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం



అర్ధరాత్రి వరకు హైడ్రామా

పేకాట రాయుళ్లను అరెస్టు చేసి మీడియాకు చూపించాల్సిన పోలీసులు వారికి అండగా ఉండి మీడియా కంట పడకుండా అర్ధరాత్రి వరకు పోలీసులు జాగ్రత్త పడుతూ వారిని కాపాడినట్లు స్థానికులు తెలిపారు. పోలీసుల తీరుపై మీడియాతో పాటు స్థానికులు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా తమ పరపతిని ఉపయోగించి విద్యుత్ సరఫరాను సైతం నిలిపివేశారని, ఇదే సమయంలో సమాచారం సేకరించేందుకు అక్కడికి వెళ్లిన కొంత మీడియా ప్రతినిధులపై పేకాటరాయుళ్ల అనుచరులు బరితెగించి చేయి కూడా చేసుకున్నారు. ఈ తతంగాన్ని అక్కడే ఉన్న ఎస్‌వోటీ, మేడిపల్లి పోలీసులు చూశారే తప్ప ఎవరినీ అడ్డుకోలేదు.

హైకోర్టు తీర్పు హర్షణీయం

కాప్రా: ఎస్సై, కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలో తప్పు ప్రశ్నలకు మార్కులను కలపాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలుచేసిన టీఎస్ఎల్‌పీఆర్‌బీ బోర్డు నిర్ణయం హర్షణీయమని ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సత్యప్రసాద్ అన్నారు. కమలానగర్‌లోని ఏఐవైఎఫ్ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన ప్రాథమిక పరీక్ష ప్రశ్నపత్రాల్లో తప్పుగా వచ్చిన ఏడు ప్రశ్నలకు మార్కులను కలపాలని అభ్యర్థుల పోరాటం చేశారని, హైకోర్టు తీర్పు హర్షణీయమన్నారు. పరుగు పందెం విభాగంలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులందరికీ మెయిన్స్ అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీస్ యూనిఫామ్ ధరించి రాష్ట్రానికి సేవ చేయాలనే తపన ఉన్న అభ్యర్థుల డిమాండ్లను బోర్డు పరిగణలోకి తీసుకోవాలన్నారు. పలువురు ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు

నలుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

మేడిపల్లి: ఓ రియల్ ఎస్టేట్ కార్యాలయంలో పేకాట ఆడుతున్న నలుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పర్వతాపూర్ సాయిప్రియ కాలనీలోని ఓ రియల్ ఎస్టేట్ కార్యాలయంలో పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు మల్కాజిగిరి జోన్ ఎస్‌వోటీ పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. పీర్జాదిగూడ పరిసర ప్రాంతాలకు చెందిన షేక్ జహంగీర్, గోరెలి వీరేషం, ఎంపల సత్తిరెడ్డి, పిట్టల కార్తీక్‌ను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.లక్ష 62 వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు మేడిపల్లి పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కుషాయిగూడ: పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్టు చేసిన ఘటన సోమవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఏఎస్‌రావునగర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు ఆకస్మిక దాడులు జరిపి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.25 వేల నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కుషాయిగూడ పోలీసులకు అప్పగించారు. చెంబట్ల లక్ష్మణ్, సిరిబత్తుల రామ్మోహన్, పూసల మోహన్, బీతి విద్యాసాగర్, అయకపతి, పిట్ల నాగరాజు, వేణు శామ్యూల్ ఉన్నట్లు తెలిపారు.

గుర్రపు డెక్క తొలగింపు పనులు షురూ



గుర్రపు డెక్క పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని పటేల్‌కుంట చెరువులోని గుర్రపు డెక్క తొలగింపు పనులను సోమవారం జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చెరువులోని గుర్రపు డెక్క తొలగించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. చెరువులో మురుగు చేరకుండా ప్రత్యేక పైప్‌లైన్ వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఎస్‌ఈ గంగప్ప, ఏఈ రమేష్, సూపర్‌వైజర్ నరసింహ, బీఆర్ఎస్ నేతలు సాయిజెన్‌శేఖర్, ముత్యంరెడ్డి, శ్రీరామ్ సత్యనారాయణ, కర్ణ, పాండునాయక్, విఠల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లలో చోరీలకు పాల్పడే ముఠా అరెస్టు



కుషాయిగూడ: తాళాలు వేసిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడే ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ముగ్గురు దొంగలను అరెస్టు చేసి వారి వద్ద బైక్, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. డీఐ గురువారెడ్డి వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన చాలంగి సురేష్(38) మర్రి రవికుమార్(34) అజయ్ 2014లో గుంటూరు జైల్‌లో పరిచయమయ్యారు. సురేష్‌పై 25, రవికుమార్‌పై 12 చోరీ కేసులు ఉన్నాయి. గుంటూరు నుంచి రైల్‌లో నగరానికి చేరుకొని దొంగతనం చేయాలని నిర్ణయించుకొని లాడ్జిలో దిగేవారు. తిరగడం కోసం బైక్‌ను చోరీ చేసి తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీ చేసి సొత్తుతో సొంతూరుకు పారిపోయేవారు. నగరానికి వచ్చిన ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రెండు కిలోల వెండి వస్తువులు, ఓ బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తా

ఉప్పల్: డివిజన్ పరిధిలో రాఘవేంద్రాకాలనీలో ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి సోమవారం స్థానిక సమస్యలపై కాలనీల్లో అధికారులతో కలిసి పర్యటించారు. కొంతకాలంగా కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, రోడ్లు సరిగ్గా లేవని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బొంగు రమేష్ గౌడ్, బిక్కు మళ్ల ఆశోక్ గుప్తా, భూత్కూరి శ్రీరాములు, పంజాల జైహింద్ గౌడ్, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



నాచారంలో బస్తీదవాఖానా అదనపు గదికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతి సాయిజెన్

మల్లాపూర్: రాజకీయాలకు అతీతంగా ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. నాచారం డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌తో కలిసి రూ.2.25 కోట్లతో చేపట్టనున్న పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేకల ముత్యంరెడ్డి, అంజి, బుచన్నగౌడ్, విఠల్‌యాదవ్, చంద్రశేఖర్, సుగుణాకర్‌రావు, రఫీక్, లక్ష్మణ్, రాంచందర్, రాజు, టీకే రాజశేఖర్, శివ, దాసరి కర్ణ, మంగోల్ శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కాలనీలో అభివృద్ధి పనులు

మౌలాలి: మౌలాలి డివిజన్ కృష్ణనగర్‌లో రూ.30 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులు, గీతానగర్‌లో రూ.25 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను సోమవారం కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మౌలాలి డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు సాయిబాబు, ప్రధాన కార్యదర్శి శివకుమార్‌గౌడ్, నాయకులు వెంకటేష్, శ్రీనివాస్‌యాదవ్, జహంగీర్, రమణనాయుడు, మహేష్, రాము, గీతానగర్ కాలనీ అధ్యక్షులు అమర్‌నాథ్‌రెడ్డి, కాలనీవాసులు కృష్ణమూర్తి, నాగేందర్, మాలతి, కృష్ణనగర్ కాలనీ సభ్యులు ఎండీ.సాజన్, హలీ, అజీజ్ పాషా తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత

కాలనీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం

కుషాయిగూడ: కాలనీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందజేస్తానని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. నూతనంగా ఎన్నికైన న్యూవిరాట్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులను ఆమె సత్కరించారు. కాలనీ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే దశలవారిగా పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో న్యూవిరాట్‌నగర్ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు టి.సుధీర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేష్, కోశాధికారి జూపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



న్యూవిరాట్‌నగర్ నూతన కార్యవర్గంతో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

విజయవంతంగా భారత్ జోడో యాత్ర

మల్కాజిగిరి: రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర విజయవంతమైందని బి బ్లాక్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. పోల్కం వెంకటేష్, వెంకటేష్‌యాదవ్, గుత్తి రాంచందర్, శ్రీనివాస్‌గౌడ్, సిరిగిరి నర్సింగరావు, రాములు, ఉమేష్‌సింగ్ పాల్గొన్నారు.



ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం



ఉప్పల్: లెప్రసీపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రస్తుతం బిజీ లైఫ్‌లో ఆరోగ్యంపై దృష్టి సారించడం లేదన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. డా.సౌందర్యలత, ప్రకాశ్ పాల్గొన్నారు.

కరాటే, కుంగ్‌ఫూలో సత్తాచాటిన విద్యార్థులు

బోడుప్పల్: షాపూర్‌నగర్‌లో ఎంజే గార్డెన్‌లో శరణ్య కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 2వ నేషనల్ లెవెల్ 12 సంవత్సరాలలోపు కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో బోడుప్పల్‌కు చెందిన సన్ ఫైటర్స్ కుంగ్‌ఫూ విద్యార్థులు సత్తా చాటినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు నంద ప్రసాద్ వెల్లడించారు. బోడుప్పల్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు జోత్స్నవి, పౌర్ణమి, వశీకరణ, షాహిద్, సూర్య మనోహర్ బంగారు పతకాలు, లాస్యా, మానస వీణ, యశ్వంత్ సిల్వర్ మెడల్ సాధించినట్లు వెల్లడించారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.



మెడల్స్ అందుకుంటున్న విద్యార్థులు

పనుల్లో నాణ్యత లోపిస్తే ఊరుకోం..

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలో ఎస్‌జీఆర్‌ఐ కాంపౌండ్ వాల్ నుంచి రాఘవేంద్రానగర్ కాలనీ వరకు నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతప్రవీణ్ సోమవారం జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానికులతో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని కాంట్రాక్టర్‌కు సూచించారు. కొండల్‌రెడ్డి, జగన్, రామానుజన్, మహేందర్, బింగి శ్రీనివాస్, బాణాలు నారాయణరెడ్డి పాల్గొన్నారు.



మహాత్ముడికి ఘన నివాళి

మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం పలుచోట్ల గాంధీజీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ సేవలను కొనియాడారు. పలువురు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ గాంధీ మార్గంలో నడవాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు.



కాప్రా సర్కిల్ కార్యాలయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి తదితరులు



మల్లాపూర్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి



నాచారంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



గౌతంనగర్ డివిజన్ ఈస్ట్ ఇందిరానెహ్రూనగర్‌లో..



అల్వాల్‌లో నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్



హెచ్‌బీకాలనీలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్



చక్రిపురంలో బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి తదితరులు



మల్కాజిగిరిలో టీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు



మల్కాజిగిరిలోని గాంధీపార్కులో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్



మల్కాజిగిరిలో కాంగ్రెస్ నాయకులు